# అంతరాత్మ

డా॥ కె.వి.యస్. రామారావు



హరికేన్ జార్జ్ దగ్గరకు వచ్చేస్తోందని రేడియో ఘోష పెడుతోంది. ఊళ్లో జనం అందరూ ఎక్కడికో పారిపోతున్నట్లు రోడ్లు కార్లతో నిండిపోయాయి. నగరం మీదికి వర్షధారల బాణాల్ని ఎక్కుపెట్టి యుద్ధానికి సిద్ధమౌతున్నది ఆకాశం.

ఎయిర్‌పోర్ట్‌లో టాక్సీ ఆగటంతోటే దిగి లోపలికి పరుగెత్తాడు రమాకాంత్. ఫ్లైట్ గనుక కరెక్ట్ టైముకి బయలుదేరుతూ ఉంటే తను విన్ అవుతాడు. అనుమానం లేదు. అయితే అన్ని ఫ్లైట్లూ డిలే అవుతున్నట్లున్నాయి కాబట్టి తనది కూడా అలాగే అవుతుందని ఆశ.

లోపలికి వెళ్లి మానిటర్‌లో వెదికాడు. తన ఊహ నిజమే. ఫ్లైట్ రెండు గంటలు లేటవుతున్నది.

మెల్లగా నడుచుకుంటూ గేటు దగ్గరకు వెళ్లాడు. జనంతో కిటకిటలాడిపోతోంది. ఫ్లైట్ డిలే గురించి ఇప్పుడే తెలిసినట్లుంది. దిగాలుగా చూసేవాళ్లు, నమ్మలేనట్లుగా తల కదిలించేవాళ్లు, హడావుడిగా సెల్ ఫోన్స్‌లో మాట్లాడేవాళ్లు, నిర్వికారంగా కాళ్లు చాపుకుని కళ్లు మూసుకున్నవాళ్లు ఒకే ఉదంతానికి ఒక్కొక్కరి నుంచి ఒక్కో రకమైన స్పందన.

రమాకాంత్ చుట్టూ చూశాడు ఎక్కడైనా కూర్చోటానికి స్థలం ఉందా అని. మూడు గేట్ల అవతల వెయిటింగ్ ఏరియా నిర్మానుష్యంగా ఉంది. అక్కడికి వెళ్లి ఒక కుర్చీలో కూర్చున్నాడు ఎదురుగా మానిటర్ కనిపించేలా చూసుకుని. కళ్లు మూసుకుని కాళ్లు చాపుకుని ఆలోచనల్లోకి ఎగిరిపోయాడు.

సమయం రాత్రి 8.30 గంటలు. అదృష్టం బాగుండి ఫ్లైట్ ఇంకా ఆలస్యం కాకుండా బయలుదేరితే 11.30కి ఇల్లు చేరుకోవచ్చు. స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రమాకాంత్ ఒక ప్రొఫెషనల్ కాన్ఫరెన్స్‌లో పేపర్లు ప్రెజెంట్ చేసి ఇంటికి తిరిగి వెళ్తున్నాడు.

ఎక్కడో ఏదో ఎనౌన్స్‌మెంట్. ఉలిక్కిపడి లేచాడు రమాకాంత్. సమయం 9 గంటలు చూపిస్తోంది. తనకు తెలియకుండానే కునుకు పట్టినట్లుంది. మానిటర్‌వైపు చూశాడు. తన ఫ్లైట్ పరిస్థితిలో ఏమీ మార్పు లేదు. ఇంకో గంట పైగా

ఉన్నది. ఎదురుగా ఫోన్ బాంక్ దగ్గరకు వెళ్లి ఇంటికి ఫోన్ చేసి తను ఎప్పటికి ఇల్లు చేరుకునేదీ చెప్పలేనని, తనకోసం ఎదురు చూడవద్దని జానకితో చెప్పాడు.

తిరిగి వెళ్లి తన స్థానంలో కూర్చున్నాడు. ఏమీ తోచటంలేదు. ఒకసారి చుట్టూ చూశాడు. పక్క గేటు వెయిటింగ్ ఏరియాలో రెండో చివర ఒక ఆఫ్రికన్ కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు. దగ్గర్లో మరో మనిషి లేదు.

మళ్లీ కాళ్లు చాపుకుని కళ్లు మూసుకోబోయాడు. కాకపోతే తన పక్క సీటుకింద ఏదో వస్తువు ఉన్నట్లు అనిపించి కళ్లు కొంచెం తెరిచి బద్ధకంగా అటు చూశాడు. అక్కడో సంచి పడి ఉంది. మామూలు కారీ ఆన్ లగేజ్. కానీ ఎందుకో దాన్ని చూడటంతోనే దాన్లో ఏదో ముఖ్యమైన వస్తువు ఉండి ఉండాలనిపించింది అతనికి. ఇంకొంచెం పరీక్షగా చూశాడు. జిప్ పూర్తిగా వేసి లేదు. దాన్లో ఏం ఉందో చూడాలని కుతూహలం. ఒకసారి చుట్టూ చూసి తనని గమనించటానికి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుని ఆ ఖాళీలోంచి లోపలికి గభాల్న తొంగిచూసి మళ్లీ మామూలుగా కూర్చున్నాడు. కొద్ది క్షణాలకి గాని తను చూసింది నోట్ల కట్టలని అతని మెదడుకు సమాచారం అందలేదు. వెంటనే మళ్లీ, ఈసారి ఇంకాస్త పరిశీలనగా లోపలికి తొంగి చూశాడు. వంద డాలర్ల నోట్లు! కట్టలు కట్టలుగా! ఆ సంచినిండా అవే ఉండి ఉంటే మొత్తం కలిసి ఒక మిలియన్ డాలర్లున్నా ఆశ్చర్యపడనక్కరలేదు.

ఒక మిలియన్ డాలర్లు .... తన పక్కనే!

అయితే ఆ సంచి అక్కడికి ఎలా వచ్చింది? తను రావటానికి ముందే అక్కడ ఉందా, లేకపోతే తను కునుకు తీస్తున్నప్పుడు గానీ, లేక ఫోన్ చెయ్యటానికి వెళ్లినప్పుడు గానీ ఎవరైనా వచ్చి అక్కడ కూర్చున్నారా? ఫోన్ చేసేటప్పుడు కూడా తను ఇటు చూస్తూనే మాట్లాడాడు. ఎవరూ ఇటువైపుగా రావటం గమనించలేదు. కాబట్టి కునుకు తీసినప్పుడు అయి ఉండాలి. అలా అనుకున్నా, ఇంత డబ్బు ఉన్న సంచిని ఎవరైనా ఇలా వదిలేసి వెళ్తారా? అసలు ఇంత డబ్బు కరెన్సీ రూపంలో ఎవరు దగ్గర పెట్టుకుంటారు? పైగా ఈ సంచేమిటి, దీన్లో ఇంత డబ్బు ఉండటం ఏమిటి? తప్పకుండా దీన్లో ఏదో వ్యవహారం ఉంది.

కొంపదీసి టీవీ షోల వాళ్లు ఎవరైనా కావాలని ఈ సంచీ తన పక్కన పడేసి దగ్గర్లో ఉండి ఇక్కడే ఎక్కడో దాచిపెట్టిన వీడియో కెమెరాలోంచి ఇదంతా రికార్డ్ చేయటంలేదు కదా! ఎదురుగా ఉన్న మానిటర్స్‌లో గానీ, లేకపోతే సీలింగ్‌లో గానీ దాన్ని దాచి ఉంచటానికి బోలెడంత అవకాశం ఉంది. తను తొందరపడి ఆ సంచిని తీసుకుంటే బిలబిలమంటూ వాళ్లు పరుగెత్తుకొచ్చి "వెర్రి వెధవాయిలాగా దొరికిపోయావోచ్!" అని చప్పట్లు కొట్టి, గేలి చేసి ఆ తర్వాత టీవీలో తన సిగ్గుమాలిన ప్రవర్తనని ప్రపంచం మొత్తానికి చూపించేస్తారు.

ఆ ఊహ రావటంతోనే ఉలిక్కిపడి అక్కడ నుంచి లేచి ఎదురుగా, ఫోన్ బాంక్ దగ్గరగా వెళ్లి నిలబడ్డాడు. ఇప్పుడు ఆ సంచి స్పష్టంగా కనిపించటంలేదు గానీ అక్కడ ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. ఎవరైనా అటు వస్తే తప్పకుండా కనిపెడతారు.

అంతా బాగానే ఉంది గానీ, ఆ సంచీని నిజంగానే ఎవరో పారేసుకుని ఉంటే? ఎలా తెలుస్తుంది?

పారేసుకున్నదా, లేక ఎవరైనా కావాలని అక్కడ ఉంచిందా అనేది తేలాలంటే ఒకటే మార్గం. ఆ సంచిని అక్కడి నుంచి తీస్తే ఏమవుతుందో చూడటం. కాకపోతే ఆ పని తను కాకుండా ఇంకెవరన్నా చేస్తే బాగుంటుంది. ఎవరినన్నా అడిగితే? ఏమని అడగాలి? "అయ్యా! ఈ సంచిలో మిలియన్ డాలర్లు ఉన్నాయి. దీన్ని తీసుకుని ఒకసారి అటూ ఇటూ తిరిగి మళ్లీ తీసుకొచ్చి ఇక్కడే పెట్టమనా?" ఒకవేళ ఎలాగోలా చెప్పి ఎవరో అమాయకుణ్ణి ఒప్పించగలిగినా వాడు దాన్ని తీసుకుని అలాగే వెళ్లిపోతే? తనెలా ఆపగలడు? అది జరిగే పని కాదు. రిస్క్ చాలా ఎక్కువ. ఆ ప్రయోగం ఏదో తనే చెయ్యాలి తప్ప ఇంకెవర్నీ నమ్మకూడదు. అంతకన్నా గత్యంతరం లేదు.

గుండె చిక్కబట్టుకుని బిక్కుబిక్కుమంటూ ఆ సీటు దగ్గరకు నడిచాడు. తల పక్కకు తిప్పకుండా చుట్టుపక్కల కదలికలు ఏమైనా ఉన్నాయేమోనని గమనిస్తూ శబ్దాలేమైనా వినిపిస్తాయేమోనని జాగ్రత్తగా వింటూ సంచి చేతిలోకి తీసుకున్నాడు. అబ్బ! ఎంత సుఖం, ఎంత హాయి!

సంచి తీసుకుని టకటకమని నడుచుకుంటూ సెక్యూరిటీ గార్డ్ ఉండే వైపుకు వెళ్లాడు. ఎవరైనా ఆపితే గార్డ్‌కి ఇవ్వటానికి వెళ్తున్నానని డబాయించి చెప్పొచ్చు. చుట్టుపక్కల ఏమీ అలికిడి లేదు. గార్డ్ ఎదురుగా కనిపిస్తున్నాడు. మరీ దగ్గరకి వెళ్తే ఏమిటని అడిగే ప్రమాదం ఉంది. వెంటనే ఏదో మర్చిపోయినట్లు నటించి వెనక్కు తిరిగాడు. వెళ్లిన దారినే తిరిగి వచ్చి సంచి అదివరకు ఉన్న సీటు దగ్గరే, అయితే ఈసారి సీటు పైన పెట్టాడు. మళ్లీ వెనక్కు వచ్చి ఫోన్ బాంక్ దగ్గర నిలబడి ఎవరన్నా వస్తారేమోనని జాగ్రత్తగా గమనించసాగాడు.

ఏమీ జరగలేదు, ఎవరూ రాలేదు. పది నిముషాలు. పావుగంట. ఏరీ, ఎక్కడ? ఇది టీ వీ షో వ్యవహారం కాదా ఏమిటి?


మరైతే సంచీ ఎవరిది? ఎవరన్నా డ్రగ్ స్మగ్లర్ ఇక్కడ పెట్టి పక్కకు వెళ్తే అంతలో పోలీసులు వచ్చి వాణ్ణి పట్టుకుపోయారా? మరి ఈ డబ్బు సంగతి వాళ్లు ఎందుకు గమనించలేదు? వాడు చెప్పి ఉండడు. బహుశః జైలు నుంచి తన ఫ్రెండ్స్‌కి ఫోన్ చేసి చెప్తాడు. అప్పుడు వాళ్లు పరుగెత్తుకొచ్చి ఆ సంచీ తీసుకెళ్తారు.

కానీ ఈలోగా ఇంకెవడన్నా ఆ సంచిని పట్టుకెళ్తే? ఆ విలన్లు వెంటబడతారా? సినిమాల్లోలాగా ఎలాగోలా ఆ చూకీ తెలుసుకుని వెళ్లి వాడిని తన్నో, చంపో డబ్బు లాక్కుంటారా?

దీనికన్నా ఎక్కువ ఛాన్సు ఉన్నది ఇంకోటుంది. ఇది రేన్సం డబ్బు అయి ఉంటుంది. ఎవర్నో కిడ్నాప్ చేస్తే వాళ్లవాళ్లు ఈ డబ్బు ఇక్కడ పెట్టి వెళ్లారు.

మరి అలా అయితే అటువాళ్లు గానీ, ఇటు వీళ్లు గానీ కనపడరేం?

ఇంతలో అవతలగా కూర్చుని ఉన్న ఆఫ్రికన్ వ్యక్తి లేచి నిలబడి కళ్లు నులుముకుని చేతులు జాడించాడు. తలమీద పెట్టుకుని ఒళ్లు విరుచుకున్నాడు. కూనిరాగం తీసుకుంటూ డాన్స్ చేస్తున్నట్లు ఒయ్యారంగా నడుచుకుంటూ



బయలుదేరాడు.

రమాకాంత్ గుండెవేగం హఠాత్తుగా పెరిగింది. ఆ సంచిని అతను తీసుకెళ్తే? అయ్యో, ఇంకేమన్నా ఉందా? మిలియన్ డాలర్లు కొట్టెయ్యబోతున్నాడు. ఇది చాలా అన్యాయం, అక్రమం. పోలీసుల్ని పిలిస్తే? ఆ సంచి నాదేనని వాడిని డబాయిస్తే?

అతను ఈలోగా ఆ సంచి చేరువలోకి వెళ్లాడు. అది ఇప్పుడు అక్కడ కనపడటంలేదు. అతను దానికి అడ్డంగా వచ్చాడు. తీసుకుంటున్నాడా? అనవసరంగా నే సీటు కింద ఎవరికీ కనపడకుండా ఉన్న దాన్ని తీసి సీటుపైన పెట్టాడు. ఎంత బుద్ధితక్కువ పని చేశాడు! చూస్తే ఎయిర్‌పోర్ట్‌లో పనిచేసేవాడిలాగా కనిపిస్తున్నాడు. వీడి మొహానికి మిలియన్ డాలర్లా? అసలంత డబ్బు ఒక్కసారిగా చూస్తే వాడికి హార్ట్ ఎటాక్ వస్తుందేమో!

లేదు. అతను తీసుకోలేదు. దానివంక చూడను కూడా లేదు. పక్కగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. హమ్మయ్య! ఒక గండం గడిచింది.

ఆకలి దంచేస్తోంది. ఇలా ఆలోచిస్తూ కూర్చుంటే రెస్టారెంట్లు అన్నీ మూసేస్తారు. అప్పుడిక తినటానికి ఏమీ దొరకదు.

లేచి రెస్టారెంట్లకోసం వెదుక్కుంటూ వెళ్లాడు. ఒక ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో శాండ్‌విచ్ కొనుక్కుని గబగబా తినేశాడు. ఆ సంచి ఇంకా ఉందా, లేకపోతే ఈలోగా ఎవరైనా తీసుకుపోయారా?

చకచకా లేచి మళ్లీ గేటు దగ్గరకు బయలుదేరాడు. తన ఫ్లైట్ రావాల్సిన గేటు దాటాడు. ఒకటి, రెండు, మూడు .... ఇదే ఆ సంచి ఉన్న గేట్. కానీ సంచీ ఏదీ?

సంచి అక్కడనుంచి మాయం అయింది!

రమాకాంత్‌కి నాలుక పిడచగట్టుకుపోయింది. ఒళ్లంతా చెమటలు. మొదడు మొద్దుబారిపోయింది. తను కొద్ది నిమిషాలు పక్కకు వెళ్లగానే ... ఎవడో దొంగవెధవ మిలియన్ డాలర్లు కొట్టేశాడు!

ఇది దొంగతనమే, అనుమానం లేదు. ఆ టీ వీ షో వాళ్లు ఏరీ, ఎక్కడా కనపడరే? రేస్పం డబ్బు అయినా కూడా ఏ ఎఫ్.బి.ఐ.వాళ్లో వచ్చి ఉండాలి కదా ఈ పాటికి? ఎవడో తలమాసిన వెధవ అప్పనంగా మిలియన్ డాలర్లున్న సంచిని చంకబెట్టుకుని వెళ్తుంటే ఏమీ జరగలేదా? ఎక్కడుంది న్యాయం, ధర్మం?

సెక్యూరిటీ గార్డ్‌లు ఉండేచోటికి పరుగెత్తాడు ఢమరుకంలా గుండె శబ్దం వినిపిస్తుంటే ధర్మాన్ని రక్షించటానికి యుద్ధానికి వెళ్తున్న పరమశివుడిలా. ఊపిరి ఆడటంలేదు. అలవాటు లేని కాళ్లు కదలమని మొండికేస్తున్నాయి. అయినా సరే పరుగెత్తాడు పూనకం వచ్చినవాడిలా.


"అక్కడ .... సంచి .... చాలా డబ్బు .... దొంగతనం ...." వగరుస్తూ తడబడుతూ నత్తినత్తిగా, మధ్యమధ్యలో పెదాల్ని తడుపుకుంటూ, చేతుల్తో అభినయిస్తూ ....

ఆ గార్డ్‌కి తను చెప్పింది ఏమైనా అర్థం అయిందో, లేదో తెలియదు. తనకి పిచ్చెక్కిందనుకున్నాడేమో! తన దుర్భర ప్రయత్నానికి, ఇంతటి పరిశ్రమకి, తాపత్రయానికి అతని నుంచి తిరిగి వచ్చింది కేవలం ఒక చిరునవ్వు, జాలితో నిండిపోయి హేళన తొంగి చూస్తున్న బరువెక్కిన నవ్వు! ఏదో అన్నట్టున్నాడు కూడా. రమాకాంత్‌కి ఏమీ వినపడలేదు.

అతను మాత్రం మళ్లీ తన పుస్తకంలోకి తల దూర్చేశాడు.

రమాకాంత్‌కి కొద్ది క్షణాల్లో మైకం వదిలింది. తనని తను చూసుకుని సిగ్గుపడ్డాడు. ఏమిటి తను చేస్తున్న పని? చూస్తే ఇది ఎవరో దేవతలు తనకు పెడుతున్న ధర్మపరీక్షలా ఉంది. తనేమో మూర్తీభవించిన మూర్ఖత్వంలా ప్రవర్తిస్తున్నాడు. తనేమిటి, తన సంస్కారమేమిటి, సంస్కృతి ఏమిటి, ఇప్పటి తన ప్రవర్తన ఏమిటి?

తనని చూసి ఎవరన్నా నవ్వుతున్నారా? ఎవరూ పట్టించుకున్నట్టు లేదు.




తల వంచుకుని వెనక్కు తిరిగాడు. మళ్లీ అదే గేటు దగ్గరకు వెళ్లి చూశాడు.

కాదు, తను చూస్తున్నది ఆ గేట్ కాదు. తను తినటానికి వెళ్లిన సమయంలో తన ఫ్లైట్ వెళ్లాల్సిన గేట్‌ని ముందుకు మార్చేశారు. అది గమనించకుండా తను అక్కడనుంచి మూడో గేట్‌కి వెళ్లి ఆ సంచి కోసం చూశాడు. నిజానికి ఆ సంచి ఉండాల్సింది ఇంకా రెండు గేట్లకు అవతల.

తడబడే కాళ్లతో ముందుకు నడిచాడు. ఇప్పటికీ అక్కడ ఎవరూ లేరు. సంచి ఎక్కడికీ కదల్లేదు. అక్కడే ఉంది.

ఇంక తను ఆగలేడు. ఈ ఉద్వేగం భరించలేడు. ఇంకొక క్షణం ఇలాగే గడిచినా తనకు పిచ్చెక్కటమో, ప్రాణమే పోవటమో ఖాయం! దీని అంతు వెంటనే తేల్చాల్సిందే!

అయినా, తనకు ఈ విషయంతో అసలేమిటి సంబంధం? అది తన సంచి కాదు అనేది పచ్చి నిజం. మరొకరిది. ఎవరిదో తెలియదు. దాన్ని వాళ్లకు అప్పగించవలసిన బాధ్యత తనకి లేదు. అలాగే ఇంకెవరన్నా దాన్ని తీసుకున్నా తను ఏమీ అనుకోవాల్సిన అవసరం లేదు. ఎప్పుడో కాదు, మొన్న రాత్రి తన మిత్రుడు కమలాకర్ వాళ్ల ఇంట్లో పార్టీలో, అమెరికాలో తెలుగు వాళ్ల ప్రవర్తన గురించిన చర్చలో ఎంతో నిర్మాణాత్మకంగా సమస్యల్ని విశ్లేషిస్తూ అలవాటు ప్రకారం ఏం ఉపన్యాసం ఇచ్చాడు తను? "మనిషిని ధర్మమార్గంలో నడిపించేవి మూడు కారణాలు. మొదటిది వాళ్ల అంతరాత్మ. అదేమిటి, ఏం చెప్తుంది అనేది ఒకో వ్యక్తి చిన్నప్పట్నుంచి పెరిగిన వాతావరణం, ఆ వ్యక్తిమీద పడిన అనేకానేక ప్రభావాల మీద ఆధారపడుతుంది. ఇంక రెండవది సంఘపరమైన ఒత్తిడి. మన దైనందిన జీవితంలో చేసే పనులు ఎక్కవభాగం సంఘానికి భయపడి, అంతరాత్మకి విరుద్ధంగా చేసేవే. మనం చేసే ఒక పనికి మనం ఎవరి అభిప్రాయాలకి విలువ ఇస్తామో, వాళ్ల దగ్గర్నుంచి వచ్చే స్పందన ఎలా ఉంటుందో అని మనం ఊహించుకుని అది మనకు అనుకూలంగా ఉండేటట్లు చూసుకోవటానికి ఎన్ని విధాలుగా అయినా ప్రయత్నిస్తాం. అదే సంఘం మన మీద పెట్టే ఒత్తిడి అంటే. ఇకపోతే చివరిది జడత్వం. అంటే అనాలోచితంగా కేవలం అలవాటు మూలాన పనులు చేసెయ్యటం. పదే పదే చేసే పనుల విషయంలో ఇది వర్తిస్తుంది. అయితే మనని ఎవరూ గమనించరని మనకి పూర్తి విశ్వాసం కలిగినప్పుడు కానీ, లేకపోతే ఎవరన్నా గమనించినా వాళ్ల అభిప్రాయాన్ని మనం లెక్కచెయ్యని పక్షంలో గానీ మన ప్రవర్తనని చాలా వరకు నిర్దేశించేది మన అంతరాత్మే!

"అందుకే అధికారం, డబ్బు ఉన్న వాళ్లు చాలామంది తమ చిత్తానికి తోచినట్లు చెయ్యటానికి వెనకాడరు. ఈ దేశానికి వచ్చి ఉంటున్న మనవాళ్ల విషయంలో ఈ పరిస్థితిని చాలా స్పష్టంగా చూడగలుగుతాం. ఇది మంచిదని గానీ, చెడ్డదని గానీ

చెప్పటం నా ఉద్దేశ్యం కాదు. నా పని కేవలం మన ప్రవర్తనకి కారణాల్ని వెదకటమే. ఇక్కడ మనమీద ఉన్న సంఘపరమైన ఒత్తిడి ముఖ్యంగా మన చుట్టుపక్కల ఎవరైనా భారతీయులు కానివాళ్లు ఉన్నప్పుడు మాత్రమే ఉంటుంది. అది కూడా ఆ ఉన్నది ఎవరు అనేదాని మీద ఆధారపడుతుంది. ఉదాహరణకు తెల్లవాళ్ల మధ్య మన ప్రవర్తనకు, నల్లవాళ్ల మధ్య మన ప్రవర్తనకు ఎంతో తేడా ఉంటుంది. దీనిక్కారణం తెల్లవాళ్ల అభిప్రాయానికి ఇచ్చినంత ప్రాధాన్యం, విలువ మనం మిగిలిన వాళ్లకి ఇవ్వకపోవటమే. అదే మన చుట్టూ ఉన్నవాళ్లు కేవలం భారతీయులే అయితే మనం ఇండియాలో ఉంటే ఎలా ప్రవర్తించేవాళ్లమో సరిగ్గా అలాగే ప్రవర్తిస్తాం. దీనివల్ల జరుగుతున్న దేమిటంటే భారతీయులతో భారతీయులు ప్రవర్తించే విధానం చాలా శోచనీయంగా పరిణమిస్తోంది. మనకిక్కడ బాగా డబ్బు ఉండటంవల్లనూ, మనని ప్రభావితం చేసే తల్లిదండ్రులు, గురువులలాంటివాళ్లు ఇక్కడ లేకపోవటంవల్లనూ, మన అవసరాలు ఏమైనా తీర్చుకోవటానికి ఈ దేశంలో డబ్బు ఉంటే చాలు గనుకనూ మనం ఒకరినొకరం లెక్క చెయ్యం. నిజానికి ఒక్కసారిగా ఇలా సంఘం తాలూకు ప్రభావం మాయం కావడంతో మన ప్రవర్తన కొంత విచిత్రంగా కేవలం స్వార్థమే పరమార్థం అన్నట్లు అనిపిస్తుంది. కానీ నా దృష్టిలో ఇది సహజమైన పరిణామ మార్గం. ఈ పరిణామం త్వరగా జరగాలంటే మనం మన అంతరాత్మల్ని పెంపొందించుకోవాలి. మనవి కాని వస్తువులకోసం ఆశించకపోవటం, మన శ్రమకు తగిన ప్రతిఫలాన్నే తీసుకోవటం, ఇంకొకరికి ఉన్నవాటిని చూసి ఈర్ష్యపడకపోవటంలాంటి విలువల్ని మనం మనసా వాచా కర్మణా అనుసరించటానికి ప్రయత్నించాలి. అప్పుడే మన అంతరాత్మ పటిష్టమౌతుంది. అప్పుడే మనం ప్రశాంతంగా తిరగగలుగుతాం. అప్పుడే మనం నిజమైన ఆనందాన్ని పొందగలుగుతాం!" చప్పట్లు ... ఈలలు!


తను చెప్పిందేమిటి, ఇప్పుడు చేస్తున్నదేమిటి? తన అంతరాత్మ ఏమైంది?

సంచి చేతిలోకి తీసుకున్నాడు. తూలుతూ కలలో నడుస్తున్నట్లుగా మళ్లీ సెక్యూరిటీ గార్డ్‌వైపుకు నడిచాడు. అతనింకా అలాగే స్టూల్ మీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు.

"ఇదీ నీకు నేను ఇందాక చెప్పిన సంచీ!" అన్నాడు రమాకాంత్. గుండె గొంతులో ఇరుక్కుపోయి ఉంది.

"సరే, నీ సంచి నీకు దొరికింది కదా! ఇంకా చెప్పటం ఎందుకు? నేను ఇందాకనే అన్నాను, ఇక్కడ ఎవరు దొంగతనం చేస్తారు?" అన్నాడతను.

"కానీ ఇది నా సంచి కాదు. ఎవరో వదిలేసి వెళ్లినట్లున్నారు!" అమ్మయ్య, అనేశాడు! హృదయంమీది బరువంతా ఒక్కసారిగా




దిగిపోయింది.

నిజంగానేనా? అలా అతనితో అన్నాడా, లేక అనుకున్నాడా?

మాట బయటికి వచ్చిందా లేదా? మనసులో అనుకోవటం మాత్రం నిజం.

మరి ఆ గార్డ్ అలా ఏమీ పట్టనట్లు కూర్చుని ఉన్నాడే!

సెక్యూరిటీ గార్డ్‌లో చలనం లేదు. అలాగే స్టూల్ మీద కూర్చుని తన పుస్తకం చదువుకుంటున్నాడు. చేతిలో సంచితో రమాకాంత్ అతని ఎదురుగా నిలబడి ఉన్నాడు.

అంటే, ఇంకా తనకి మనసు మార్చుకోవటానికి ఛాన్స్ ఉంది. అటో ఇటో తేల్చుకోవటానికి సమయం ఉంది.

మిలియన్ డాలర్లు తీసుకుని హాయిగా జీవితాన్ని అనుభవించటమా అంతా ఇచ్చేసి జీవితాంతం - తను చేసిన పని సరైనదా, కాదా అని క్షణక్షణం మథనపడటమా? ఏది దారి? ఏం చెయ్యాలి?

ఇప్పుడు అతను ఏం చెయ్యాలో నిర్ణయించవలసింది అతని అంతరాత్మ ఒక్కటే!

మిలియన్ డాలర్లు తీసుకుని ఇండియా వెళ్లి సెటిల్ అయిపోతే? ఆఖరి దశలో ఉన్న తల్లిదండ్రుల్ని పోషించినట్లూ ఉంటుంది, జులాయిగా తిరుగుతున్న తమ్ముడికి దారి చూపించవచ్చు. చుట్టాలందరికీ ఏదో ఒక విధంగా సహాయం చెయ్యచ్చు.. ఎప్పట్నుంచో అనుకుంటూ చెయ్యలేకపోతున్న పనన్నీ చేయటానికి కావలసినంత టైము చేతిలోకొస్తుంది.

ఈ సంచీ ఇప్పుడు తిరిగి ఇచ్చేస్తే తనకు వచ్చేదేమిటి? మంచి పని చేశానన్న ఆత్మ సంతృప్తా? దాని విలువ మిలియన్ డాలర్లా?

రమాకాంత్ కళ్లు మూసుకున్నాడు. గుండె ఎముకల్ని విరగ్గొట్టుకుని బయటకి రావటానికి ప్రయత్నం చేస్తోంది. కపాలం బద్దలయ్యే అంతర్ సంఘర్షణ!

ఒక్కసారిగా అతని కళ్లముందు తన బాల్యం, తన పెద్దలు, వాళ్లు చెప్పిన పురాణాలు, కథలు, జీవిత చరిత్రలు, ధర్మంకోసం సర్వం ఇచ్చిన తన పూర్వులు ... శిబి, దధీచి, దిలీపుడు, హరిశ్చంద్రుడు, శ్రవణకుమారుడు, ధర్మవ్యాధుడు .... క్షణంలో వెయ్యో వంతులో వేల సంవత్సరాల తన సంస్కృతి, సంస్కారం కోటి కిరణాలతో మహత్తర తేజఃపుంజంగా మరో మధ్యాహ్న సూర్యుడిగా మస్తిష్కంలో గుప్పున వెలిగింది, ఫెటేల్‌మని పగిలింది. ఆ వెలుగులో అతని అంతరాంతరాళాల్లోంచి వణుకు పుట్టుకొచ్చింది అద్వితీయమైన ఆనందంతో, ఉప్పొంగి ఎగిసే ఉత్తేజంతో, కదం తొక్కే గర్వంతో. అంతరాత్మ తన విశ్వరూపంతో అతనికి సాక్షాత్కరించింది. అతని సందేహాలు పటాపంచలయ్యాయి. కర్తవ్యం కరతలామలకమైంది.

నిస్సంశయంగా, నిర్భయంగా, నిశ్చలంగా, దృఢంగా ఆ సెక్యూరిటీ గార్డ్‌తో చెప్పాడు "ఈ సంచి నాది కాదు. ఎవరో పారేసుకున్నట్లున్నారు. మీరు తీసుకుని అది ఎవరిదో వాళ్లకు అందేటట్లు చూడండి!"

గార్డు ఆ సంచీని అందుకున్నాడు.

రమాకాంత్ వెనక్కు తిరిగి నిర్వికారంగా, ప్రశాంతంగా తన గేటువైపుకు నడిచాడు.

వెనుక నుంచి దభేల్‌మన్న పెద్ద శబ్దం. స్టూలు, దాని మీద కూర్చున్న వ్యక్తి కింద పడ్డట్లున్నారు.

ఎదురుగా హఠాత్తుగా వెలిగిన టీ.వీ. కెమెరా లైట్లు! మనుషులు హడావుడి పడుతున్న సందడి!

"యు ఆర్ ఆన్ లైవ్ టీవీ!" అంటున్నారెవరో!

"కంగ్రాట్యులేషన్స్!" అంటున్నారు మరెవరో. ఈ శబ్దాలు, పరిసరాలకు అతీతంగా తనదైన ఏదో లోకంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు రమాకాంత్. ■